## సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే

**కౌకుంట్ల, మూసాపేట్ మండలాలలో కాంప్లెక్స్‌లను మంజూరు చేయాలి**



**దేవరకద్ర,మార్చి26 ప్రభాతవార్త:**ఇందిరమ్మ ఇండ్లనిర్మాణంలో ఎదురవుతున్న టెక్నికల్ సమస్యలను ప్రస్తావిస్తూ ఎమ్మెల్యే అసెంబ్లీలో మాట్లాడారు. ఇండ్ల మంజూరు నిర్మాణం ప్రక్రియలో తలెత్తుతున్న సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించాలని గురువారం అసెంబ్లీలో ప్రస్తావిస్తూ మంత్రిని కోరారు.లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించి, నిర్మాణ పనులు వేగవంతం చేసి, ప్రజలకు త్వరగా ఇండ్లు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన ఎల్3 లిస్టులో ఉన్న టెక్నికల్ ఇష్యూలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అదేవిధంగా ఎల్2 లిస్ట్ కు సంబంధించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరై ప్లాట్స్ లేక లబ్ధిదారులు ఇల్లు కట్టుకోలేకపోతున్నారు. ఈ సమస్యపై త్వరితగతిన అసైన్మెంట్ కమిటీలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్న గ్రామాలలో ఇల్లు లేని వారికి ప్లాట్స్ మంజూరు చేస్తే వాళ్ళు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటారని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా కౌకుంట్ల, మూసాపేట్, మండలాలలో ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. ప్రభుత్వం ఈ రెండు మండలాలలో మండల కాంప్లెక్స్ లను మంజూరు చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అసెంబ్లీలో మంత్రిని కోరారు.

## రాష్ట్ర రవాణా శాఖ సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల మార్చి 26, ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్లో గురువారం రాష్ట్ర రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గంలోని ఆర్టిసి రవాణా వ్యవస్థకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. అనంతరం గద్వాల ఎమ్మెల్యే మంత్రికి సమస్యలు వివరిస్తూ గద్వాల నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు ఆర్టిసి బస్సు రవాణా సౌకర్యాలు మెరుగు పర్చాలని, ప్రతి గ్రామానికి బస్టాండ్ లను నిర్మించి ప్రాథమిక సౌకర్యాలు ఏర్పార్చాలని, రాష్ట్రంలో కొత్తగా వచ్చే ఎలక్ట్రికల్ బస్సులను అధిక మొత్తంలో కేటాయించాలని, గద్వాలలో నూతనఎలక్ట్రికల్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ నిర్మించాలని, గద్వాల బస్టాండ్‌లొ అన్ని మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి సీతక్క, మంత్రి వివేక్ వెంకటస్వామి, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్టిసి, ప్రిన్సిపల్ సెక్రటరీ రవాణా ఐఏఎస్ వికాస్ రాజు, ఇతర రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

**కౌకుంట్ల సర్పంచ్ నరేష్ కుమార్**



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

**దేవరకద్ర,మార్చి 26 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి కిషన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రారంభించామన్నారు. పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు వస్తుంటారు అందుకుగాను వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఎండాకాలంలో ప్రతి ఒక్కరికి తాగునీరు అందుబాటులో ఉండాలని, ప్రజల ఆరోగ్యం సౌకర్యమే మా ప్రాధాన్యం అని సర్పంచ్ నరేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, గ్రామపంచాయతీ కార్యదర్శి బుచ్చన్న, వార్డ్ మెంబర్లు రవీందర్ రెడ్డి, కోడి సురేందర్, కావలి లక్ష్మణ్ ఆంజనేయులు, రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, కొండన్న, రాకేష్ సాగర్, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మాణిక్యమ్మ

**కోయిలకొండ మార్చి 25, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయని హనుమాన్‌గడ్డతండా సర్పంచ్ విస్లావత్‌మాణిక్యమ్మ అన్నారు. గురువారం గ్రామ పంచాయతీలోని వడన్న చెరువు తండాలో మహిళా సంఘం భవన నిర్మాణానికి సర్పంచ్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి పంచాయ తీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి ఆదుకోవడం జరుగుతుందన్నారు. హనుమాన్ గడ్డ తండా గ్రామపంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామపంచాయతీగా నిలబెడతానన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ డైరెక్టర్ గోపాల్ నాయక్, గ్రామ ఉపసర్పంచ్ రాజు నాయక్, గ్రామపంచాయతీ కార్యదర్శి నిఖిల్, నాయకులు కోట్యా నాయక్, డీలర్ రాజు, రాములు, మాజీ ఎంపిటిసి మహేందర్ నాయక్, కానుగు బండ తండా సర్పంచ్ సందీప్ ,పూల్ సింగ్, రాజు, శంకర్, భీమయ్య, హనుమంతు, కథలయ్యా, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్, డీజిల్ సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే కారణం

**అమరచింత మార్చి 26,ప్రభాతవార్త :** దేశంలో పెట్రోల్ డీజిల్ సంక్షోభానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వమే కారణమని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ కొరతను నిరసిస్తూ గురువారం అమరచింతలో పలు పెట్రోల్ బంకుల వద్ద ఆయన ఏఐవైఎఫ్ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఇటీవల ప్రధాని మోడీ కరోనా పరిస్థితులు మళ్లీ ఎదుర్కోవాలని దేశంలో ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపించారు. బంకుల్లో పెట్రోల్, డీజిల్ స్టాక్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ కొరతను నివారించాలని బంకుల్లో కొరత లేకుండా చూడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ కు ప్రధాని మోడీ మన దేశాన్ని తాకట్టు పెట్టాలని మండిపడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించాలని ఆ ప్రపంచ దేశాలను కోరారు. యుద్ధం వల్ల అనేక అనర్థాలు ఏర్పడతాయని మరో ప్రపంచ యుద్ధానికి దారి తీయకుండా భారతదేశం నుండి కూడా అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు అజయ్, వినయ్, మైబు పాల్గొన్నారు.

## తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించడం ప్రతి ఒక్కరి బాధ్యత




మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శిరీష

**దేవరకద్ర మార్చి 26, ప్రభాతవార్త :** రైతులు తీసుకున్న రుణాలను సమయానికి చెల్లించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రాథమిక సహకార సంఘానికి బలోపేతం చేయాలని, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రత్యేక అధికారి శిరీష, సీఈఓ శ్రీనివాసులు అన్నారు. ఈ సందర్భంగా గురువారం దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన మహాజన సభలో వారు మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా అందించే రుణాలను ప్రతి ఒక్క రైతు కూడా వినియోగించుకోవాలన్నారు. రైతులకు అన్ని రకాల రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు రుణాలతో పాటు ఎల్టి లోన్లను కూడా అందిస్తున్నామని, కావలసిన రైతులు రుణాలను తీసుకొని సకాలంలో చెల్లించి,సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా కొంతమంది రైతులు మాట్లాడుతూ రైతులకు కావాల్సిన యూరియా యాప్ ని ఏర్పాటు చేయడంతో చాలామంది రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటిలాగానే సహకార సంఘం వద్దనే రైతులకు కావలసిన యూరియా సరఫరా చేయాలనే రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండులను ఆధునీకరించండి

**కొత్త బస్ సర్వీసులను ప్రారంభించండి**

**జడ్చర్లకు బస్ డిపో మంజూరు చేయండి**

**మంత్రి పొన్నం ప్రభాకర్ ను కోరిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



మంత్రి పొన్నంకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మార్చి 26, ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి అవసరమైన కొత్త బస్ రూట్లను, బస్ స్టాపులను మంజూరు చేయాలని, ఇప్పటికే ఉన్న బస్టాండ్లను అధునీకరించి ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపర్చాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు సమర్పించారు.ఆర్టీసీ సమస్యల విషయంగా అసెంబ్లీ ప్రాంగణంలో గురువారం మంత్రి పొన్నంతో జరిగిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఎమ్మెల్యేల సమావేశంలో అనిరుధ్ రెడ్డి జడ్చర్ల నియోజకవర్గంలో ఆర్టీసీ రవాణా వ్యవస్థను మరింత మెరుగు చేయాల్సిన ఆవశ్యకతను గురించి నొక్కి చెప్పారు. రాజాపూర్ మండలానికి సంబంధించి రంగారెడ్డి గూడ వద్ద బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని, రంగారెడ్డి గూడ నుంచి అగ్రహారం పొట్లపల్లి, కల్లేపల్లి, మోదంపల్లి, ఈద్గానిపల్లి, మల్లేపల్లి, రాజాపూర్ మీదుగా కొత్త బస్ రూటును మంజూరు చేయాలని కోరారు. రాజాపూర్ నుంచి కుచ్చర్కల్, చెన్నవెల్లి, తిర్మలాపూర్, దోండ్లపల్లి, కుత్నేపల్లి మీదుగా నవాబుపేటకు కొత్త బస్ సర్వీసును ప్రారంభించాలని కోరారు. మిడ్జిల్ మండలంలో భైరంపల్లి, కంచనపల్లిదోనూరు ,వస్పల,వల్లభ రావు పల్లి, రాణిపేట వరకు ఒక కొత్తరూటు, చిల్వేర్ అయ్యవారిపల్లి, వెలుగొమ్ముల, కొత్తూరు,మల్లాపూర్, మిడ్జిల్ వరకూ మరో రూటు, మిడ్జిల్‌వాడ్యాల, వేముల, మసిగుండ్లపల్లి, చెన్నవ్వల్లి, వెంకటాపూర్, అంతారం, వెల్జాల, హైదరాబాద్ వరకూ మరో కొత్త రూటును ప్రారంభించాలని ఎమ్మెల్యే కోరారు. జడ్చర్ల మండలానికి సంబంధించి జడ్చర్ల పట్టణంలో ఉన్న పాత బస్టాండ్‌లోకి బస్సులు వచ్చి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, పట్టణంలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ ను ఆధునీకరించి ప్రయాణీకుల సౌకర్యాలను మెరుగుపర్చాలని, పెరుగుతున్న అవసరాల దృష్ట్యా ప్లాట్ ఫాంల సంఖ్యను పెంచాలని కోరారు. జడ్చర్ల పట్టణంలోని నిమ్మబాయిగడ్డ, గవర్నమెంట్ హాస్పిటల్, హౌసింగ్ బోర్డ్ కాలనీల వద్ద బస్ స్టాఫులను ఏర్పాటు చేయాలన్నారు. జడ్చర్ల నుంచి గంగాపూర్ మీదుగా బస్ సర్వీసుల ను పెంచాలన్నారు. జడ్చర్ల ప్రజలు చిరకాలంగా కోరుతున్న విధంగా జడ్చర్ల బస్ డిపోను మంజూరు చేయాలని కూడా అనిరుధ్ రెడ్డి మంత్రి పొన్నంను కోరారు. అలాగే నవాబుపేట మండలంలో జడ్చర్ల నుంచి నవాబుపేట మీదుగా కారూర్– ఇప్పటూర్ యన్మన్‌గండ్ల మహబూబ్ నగర్ వరకు ఒక కొత్త బస్ రూటు, షాద్‌నగర్, ఉడిత్యాల, నవాబుపేట, మహబూబ్ నగర్ వరకూ మరో రూటు, రాజాపూర్ నుంచి లోకిరేవు మీదుగా నవాబుపేట వరకూ మరో రూటు, రాజాపూర్, దోండ్లపల్లి, లోకిరేవు, నవాబుపేట వరకూ ఇంకో కొత్త రూటును కూడా మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. చెన్నవెల్లి, రాజాపూర్, కుచ్చర్కల్, కారూర్, ఇప్పటూరు, చెన్నారెడ్డిపల్లి, యన్మన్ గండ్ల, రుద్రారం, కాకర్లపాడు లలో బస్ స్టాపులను ఏర్పాటు చేయాలని కోరారు. బాలానగర్ మండలంలోని ఈదమ్మగడ్డ తాండా, ఉడిత్యాల, వీరన్నపల్లి, గుండేడ్, నేరెళ్లపల్లి, దేగావత్ తాండ, వాయిల్ కుంట తాండా, మోతీఘన్ పూర్, గంగాధరపల్లి, గౌతాపూర్, బోడ జానంపేట, అప్పాజీపల్లి, బోడగుట్ట తాండ, పలుగుమీది తాండ, అప్పాజీపల్లి తాండ, పెద్ద రేవల్లి, మోదంపల్లి, ఏడుగుట్ల తాండ, తిర్మలగిరి, చిన్నరేవల్లి, పెద్దబాయి తాండ, పెద్ద చెల్క తాండ, పోచమ్మగడ్డ తాండ, హేమాజీపూర్, లింగారం, గాంధీపాలెం, తిమ్మారెడ్డిపల్లి, బిల్డింగ్ తాండా, మన్నెగూడ తాండ, అమ్మాయిపల్లి, చెన్ననాగుల తాండ, ఎక్వాయ్ పల్లి తాండ, చింతకుంట తాండ, ఎర్రకుంట తాండ, గాలిగూడ, పెద్దాయిపల్లి, షేరిగూడ, గుండేడ్ కట్ట మైసమ్మ, జీడిగుట్ట తాండ, మేడిగుట్ట తాండ, మాచారం, నందారం, కుంతలోపు తాండ, గుడిబండ తాండలలో బస్ స్టాపులను ఏర్పాటు చేయాలని అనిరుధ్ రెడ్డి మంత్రి పొన్నంను కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ అనిరుధ్ రెడ్డి కోరిన విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను ఆదేశించారు.

## పేరూరులో మెగా ఉచిత వైద్య శిబిరం

**పేరూరు సర్పంచ్ కొత్త శృతి అరవింద్ రెడ్డి**



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నవైద్య సిబ్బంది

**దేవరకద్ర,మార్చి 26 ప్రభాతవార్త:** గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని లక్ష్యంతో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్, వైద్య అధికారులతో కలిసి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శృతి అరవింద్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఆరోగ్యం పై అవగాహన పెంపొందించడం ఎంతో ముఖ్యమని ప్రతి ఒక్కరు ఇలాంటి శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా డా. వైద్యాధికారి రాధిక మాట్లాడుతూ పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రత్యేక వైద్య నిపుణులైన గైనకాలజిస్ట్, కంటి నిపుణులు, చిన్న పిల్లల వైద్యులు, దంత వైద్యులు, ఎముకల ఆర్థోపెడిక్, ఫిజిషియన్, క్షయ నియంత్రణలో భాగంగా ఉచిత ఎక్స్‌రే ద్వారా క్షయ పరీక్ష నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు ఈ పాల్గొని రోగులను పరీక్షించి, అవసరమైన మందులు ఉచితంగా ఇవ్వడం జరిగింది. అదేవిధంగా వివిధ వ్యాధులపై పరీక్షలు నిర్వహించి, ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సేవలను వినియోగించుకున్నారు. అనంతరం ఉచిత మెగా శిబిరానికి విచ్చేసిన సర్పంచ్ శృతి అరవింద్ రెడ్డిని, డా. వైద్యాధికారి రాధిక, ఎంపీడీవో శివప్రసాద్ కు, పంచాయతీ కార్యదర్శి అశోక్‌ను వైద్య బృందం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అరవింద్ కుమార్ రెడ్డి, డా. వైద్యాధికారి రాధిక, డా. రఘువరన్, డా. షఫీ, రాజన్న, ఎంపీడీవో శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అశోక్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నిర్వహించిన వేలం పాటలు...



వేలంపాట కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అధికారులు

**దేవరకద్ర,మార్చి 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో గురువారం పశువుల సంత, గొర్రెల సంత, తే బజార్, కోళ్ల సంత, గొర్రెల సంత, వేలం పాటలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఎటువంటి ఉద్రిక్తలు లేకుండా గ్రామ పెద్దల సమక్షంలో సక్రమంగా వేలం పక్రియ కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్మన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ నరేష్ బాబు ఆధ్వర్యంలో పశువుల సంత వేలం నిర్వహించగా దేవరకద్ర గ్రామానికి చెందిన కురువ రామదాసు 57 లక్షల 29 వేలకు పశువుల సంత పాట పాడి దక్కించుకున్నారు. గొర్రెల సంతకు సంబంధించి గ్రామానికి చెందిన రామదాసు 40 లక్షల ఒక వెయ్యి రూపాయల పాట పాడి దక్కించుకున్నారు. తై బజార్ వేలం పాట కు సంబంధించి గ్రామానికి చెందిన కుతుబుద్దీన్ (ఖుష్బూ)10 లక్షల 4 వేలకు పాట పాడి దక్కించుకున్నారు. కోళ్ల సంతను గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి 12 వేల 116 రూపాయలకు పాట పాడిన దక్కించుకున్నారు. ఈ వేలం పాటలు ప్రశాంతంగా జరిగాయి. అనంతరం అధికారులు మాట్లాడుతూ పారదర్శకంగా వేలం నిర్వహించడమే తమ లక్ష్యమని తెలిపారు. గ్రామస్తులు కూడా మాకు సహకరించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు. వేలంపాట వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా స్థానిక ఎస్సై నాగన్న పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఖాతాదారులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ : మున్సిపల్ కమిషనర్



ఆస్తిపన్ను చెల్లించాలంటూ ఆత్మకూరులో మున్సిపల్ కమిషనర్ ఇంటింటికి కలిగే తిరుగుతున్న దృశ్యం

**ఆత్మకూర్ మార్చి26,ప్రభాతవార్త:**మున్సిపాలిటీ కేంద్రమైన ఆత్మకూరులో ఆస్తిపన్ను వసూళ్లకోసం ఈ నెల 26వ తేదీ నుంచి మార్చి 31 వరకు పట్టణంలో స్పెషల్ రేవు కార్యక్రమాన్ని చేపట్టినట్లుగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ ప్రభాతవార్తకు తెలిపారు. పట్టణంలోని 10వార్డులలో ఆస్తిపన్ను వసూలు చేసేందుకుగాను తమకార్యాలయ సిబ్బంది గడిచిన రోజులుగా ముమ్మరంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రజలనుంచి స్పందనరాకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు.గతసంవత్సర కాలం నుండి ఆస్తిపన్ను చెల్లించిన వారి వివరాలను బ్యాంకు ఖాతాకు అటాచ్మెంట్ చేయడమే కాకుండా పన్ను వసూళ్ల కోసం చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు. పట్టణ ప్రజలువిధిగా ఆస్తిపన్ను మరియు నీటిపన్నుతో పాటుగా ట్రేడ్ లైసెన్స్ పన్నులు చెల్లిస్తేనే పట్టణ అభివృద్ధి కొనసాగుతుందని తద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిపాలన సౌలభ్యం అందించేందుకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు.అందులో భాగంగానే ఈనెల 24న స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ సైతం ఆత్మకూరులో పర్యటించి ఆస్తిపన్ను వసూళ్ల కోసం ప్రజలపై ఒత్తిడి తేవాలంటూ ఆదేశాలు జారీ చేసినట్లుగా కమీషనర్ తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపుగా ఆస్తిపన్ను మరియు ట్రేడ్ లైసెన్స్ ఫీజులను చెల్లించని వారిపై వ్యాపార సంస్థలకు తాళాలు వేయడమే కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని సూచించారు. గురువారం రోజు మున్సిపల్ కమిషనర్ స్వయంగా పట్టణంలోని పలు వార్డులలో కళ్ళే తిరుగుతూ అస్తి పన్ను చెల్లించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేయడం విశేషం.

## ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అజయ్

**అమరచింత మార్చి 26, ప్రభాతవార్త :** ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎస్. అజయ్ డిమాండ్ చేశారు. గురువారం అమరచింత మండలంలోని మస్తిపూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ కూలీల పని దగ్గరికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి పనులు ప్రారంభమై మూడునెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అధికారులు పెండింగ్ బకాయిలు ఇవ్వలేదన్నారు.ఉపాధిహామీ చేసిన కూలీలకు అధికారులు డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్రం 40 శాతం భరించాలని నిబంధనను వెంటనే ఎత్తివేయాలని ఆయన కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని రద్దు చేయడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్పు కోసం కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ఉపాధి హామీ కూలీలు పని చేసే ప్రదేశంలో టెంట్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్,త్రాగునీరు,పనిముట్లు తోపాటు కూలీలకు రోజుకు 600 ఇవ్వాలని ఉపాధి హామీ ఏడాదికి 200 రోజులు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా 18000 ఇస్తామని వాగ్దానంచేసిన ఇప్పటివారికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయలేదన్నారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ కూలీలకు ఇచ్చినహామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో తిరుమల శ్రీనివాసులు,పాపన్న,ఇంద్రయ్య, సుజాత, కురువ లక్ష్మి,పద్మమ్మ,చెన్నప్ప,అనూష, మునియప్ప, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

## మార్నింగ్ వాక్‌లో సమస్యల పరిశీలన

**- త్వరలో చర్యలు: కమిషనర్ శ్రీకాంత్**



డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

**మద్దూరు, మార్చి 26 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీలో గురువారం రోజు నిర్వహించిన మార్నింగ్ వాక్‌లో భాగంగా మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ రెండవ వార్డు, మూడవ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న నీటి సమస్యలను, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను గమనించిన కమిషనర్, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులపై వచ్చే కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మున్కంపల్లి నరసింహులు, కాంగ్రెస్ నాయకులు జిడి ప్రకాష్, నరసింహులు గౌడ్, మున్సిపల్ సిబ్బంది స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**వడ్డేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త :** నిరుద్యోగ జేఏసీ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం పిలుపు సందర్భంగా నిరుద్యోగ జేఏసీ నాయకులు పైపాడు శ్రీనివాసులు, పైపాడు వెంకటేశ్వర్లులను గురువారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేయడం జరిగింది. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని,నిరుద్యోగ భృతి,జాబ్ క్యాలెండర్ హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

## శ్రీ జమ్ములమ్మ అమ్మవారి దేవాలయ హుండీ లెక్కింపు


**గద్వాల మార్చి 26, ప్రభాతవార్త :** శ్రీ జమ్ములమ్మ, పరశురామ స్వామి దేవస్థానం లో గురువారం ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరి,ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్.పురేందర్ కుమార్,యూనియన్ బ్యాంకు మేనేజర్ , సిబ్బంది,సేవాపరులు,గ్రామపెద్దలు,గ్రామస్తులు,భక్తుల సమక్షంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు.ఈ హుండీ లెక్కింపులో 30రోజులకుగాను మొత్తం ఆదాయం రూ"5,71,439/ ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.ఈ హుండీ లెక్కింపులో వెండి, బంగారం ఏమి రాలేదని తెలిపారు.

## పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ఖిల్లా గణపురం మార్చి 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మామిడి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జబ్బర్ తండ్రి ఇటీవల మరణించారు. గురువారం మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పర్వతాపూర్ గ్రామానికి చెందిన కదిరి రాములు తల్లి ఇటీవల మరణించడంతో వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి వెంబడి మామిడి గ్రామానికి చెందిన రంగారెడ్డి తాజుద్దీన్, రాము, మాజీ సర్పంచ్ నాగిరెడ్డి, బాలస్వామి, మల్లారెడ్డి, తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు

**ఉప తహసీల్దార్ రమేష్ నాయక్**



మొల్గర ఇసుక రీచ్ వద్ద ఇసుక అనుమతి పత్రాలను పరిశీలిస్తున్న ఉప తహసీల్దార్ రమేష్ నాయక్

**ఉప్పునుంతల, మార్చి 26 ప్రభాతవార్త :** ఇసుక రవాణాపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విధించిన నిబంధనలు ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని ఉప తహసీల్దార్ రమేష్ నాయక్ హెచ్చరించారు. మండలంలోని మొల్గర వద్ద ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ నుంచి ఆన్లైన్ ద్వారా సరఫరా చేస్తున్న ఇసుక ట్రాక్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనల ప్రకారంగా ఇసుక రవాణా చేసుకోవాలని, అవకాశాన్ని అడ్డుగా పెట్టుకొని ఆన్లైన్ మాటున అక్రమ ఇసుక రవాణా చేపడితే కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గురువారం ఆన్లైన్ ఇసుక ట్రాక్టర్లను పరిశీలించారు. పరిశీలించిన వారిలో ఉప తహసీల్దార్ రమేష్ నాయక్,జిపిఓ ఆంజనేయులు, రెవెన్యూ సిబ్బంది లాలయ్య తదితరులు ఉన్నారు.

## ఇష్టారితిగా ఇసుక అనుమతులు



**చిన్న చింతకుంట, మార్చి26 ప్రభాతవార్త:** మండల తహసిల్దార్ కార్యాలయం ఇసుక అనుమతులు ఇష్టానుసారంగా ఇస్తున్నారు. గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు, అభివృద్ధి పనులకు గాను అవసరాన్ని బట్టి ఇసుక అనుమతి ఇవ్వాలి కానీ క్షేత్ర స్థాయిలో గ్రామస్థాయి అధికారులు పరిశీలన లేకుండానే ఇసుక అనుమతులను తహసిల్దారు ఇస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతిరోజు ఇందిరమ్మ ఇండ్లు పేరిట ఇసుక అనుమతి కోసం కార్యాలయం లో దరఖాస్తు చేసుకుంటున్నారు. గ్రామాలలో ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నారు దానికి తగ్గట్టుగా ఇసుక ఎన్ని ట్రిప్పులు ఇవ్వాలి అని వాస్తవ పరిశీలన చేయకుండానే అనుమతులు ఇస్తున్నారు. గ్రామ పరిపాలన అధికారి పరిశీలన చేసిన తర్వాత నిజంగా ఇందిరమ్మ ఇండ్లకే అని నిర్ధారణ చేసిన తర్వాత ఇసుక అనుమతులు ఇవ్వాలనీ ప్రజలు కోరుతున్నారు. తహసిల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే పరిశీలన చేయకుండానే ఇసుక అనుమతులు ఇస్తున్నారన్నా సాకును తీసుకున్న ఇసుక మాఫియా ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక కోసం 20 నుంచి 50 ట్రిప్పుల వరకు ఇసుక అనుమతి తీసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**ఇసుక అనుమతికై ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి : తహసీల్దారు ఎల్లన్న**

ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇసుక అనుమతులపై ఆన్లైన్ లోనే దరఖాస్తులు చేసుకోవాలని తహసిల్దారు ఎల్లన్న తెలిపారు. తెలంగాణ రాష్ట్రమైనింగ్ అభివృద్ధి సంస్థపేరిట ఇసుక అనుమతులపై దరఖాస్తులు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుకను తీసుకు వచ్చన్నారు. అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వంనిర్దేశించిన ధరకు ఆన్లైన్‌లోనే చెల్లించి ఇసుక అనుమతులు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట ఇసుకను తీసుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తే అట్టి ట్రాక్టర్లను సీజ్ చేస్తామని తహసిల్దార్ హెచ్చరించారు. గ్రామ స్థాయిలో గ్రామ పరిపాలన అధికారి ఇసుక అభివృద్ధి పనులకు ఉపయోగిస్తున్నారా లేదా అనేది పరిశీలించాలని ఆయన సూచించారు.

## ఇసుక అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ట్రాక్టర్ పట్టివేత

**గండిడ్ మార్చి 26, ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక టిప్పర్ ఒక ట్రాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించిన సంఘటన. మహ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మదాబాద్, గండిడ్ మండలాల్లో రాత్రి సమయంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్ ట్రాక్టర్‌ను మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇక మీదట అక్రమ ఇసుక రవాణాకు ఎవరైనా పాల్పడితే చట్టారీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వం ఎంపిక చేసిన శాండ్ రీచ్‌ల నుంచే ఇసుకను తరలించాలి : అచ్చంపేట ఆర్‌డిఓ యాదగిరి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ యాదగిరి

**ఉప్పునుంతల, మార్చి 26 ప్రభాతవార్త :** శాండ్ ను ఎంపిక చేసిన శాండ్ రీచ్ నుంచి మాత్రమే ఇసుక ను తరలించాలని అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి అవగాహన కల్పించారు. గురువారం సాయంత్రం శాండ్ బ్యాంకింగ్ విధానం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రభుత్వ అమలు చేస్తున్న శాండ్ పాలసీ ప్రకారం శాండ్ ను కేవలం అధికారిక మార్గాలలో ఆన్లైన్ బ్యాంకింగ్ విధానం ద్వారా మాత్రమే పొందాలని సూచించారు. అనుమతులు లేకుండా శాండ్ తరలింపు పూర్తిగా నిషేధమని సూచించారు. అక్రమంగా ఇసుకను తరలింపు చేపడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ఈ విషయంపై తహసీల్దార్, స్థానిక ఎస్సై లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. అచ్చంపేట ఆర్‌డిఓ యాదగిరి నిర్వహించిన అవగాహన సదస్సులో రెవెన్యూ సూపరింటెండెంట్ రమేష్ నాయక్, జిపిఓలు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ శిబిరం ప్రారంభం

**నారాయణపేట, మార్చి 26 ప్రభాతవార్త :** నారాయణపేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నారాయణపేట జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రికుల కోసం వాక్సినేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ జయ చంద్ర మోహన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల జి.ఆర్. రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో మొత్తం 15 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సిన్ అందించగా, అందులో 7 మంది మహిళలు ఉన్నారు యాత్రికులకు ముందురోజు మెడికల్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించగా వాక్సినేషన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దర్గాహ్ హజ్రత్ తకి బాబా సజ్జాదా నషీన్ జనాబ్ సయ్యద్ షా గియాసుద్దీన్ ఖాద్రీ, కోలంపల్లి సజ్జాదా వారసుడు జనాబ్ అల్‌హాజ్ సయ్యద్ షా అహ్మద్ హుసైనీ అష్రఫీ, అధ్యక్షుడు అల్‌హాజ్ అమీరుద్దీన్ అడ్వకేట్, ప్రధాన కార్యదర్శి అల్‌హాజ్ ఉస్మాన్ ఉబైదుల్లా సిద్దీకి తదితరులు హజ్ యాత్రికులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అల్‌హాజ్ మోలానా గులాంమహ్మద్ రషీది ప్రసంగిస్తూ, నారాయణపేట హజ్ సొసైటీ సేవలను అభినందించారు. జిల్లా ఏర్పడిన తర్వాత వరుసగా మూడు సంవత్సరాలుగా యాత్రికులకు ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హజ్ సొసైటీ సభ్యులు అల్‌హాజ్ మహ్మద్ అబ్దుల్ సలీమ్ అడ్వకేట్, అబ్దుల్ అజీమ్ మర్కీ, అబ్దుల్ ఖాదర్, అల్‌హాజ్ మహ్మద్ తకి చాంద్, అల్‌హాజ్ ఇజాజ్ హుస్సేన్ (రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్), ఖాజీ మహ్మద్ తకి ఖరాడీ, మహ్మద్ అజరుద్దీన్, మోలానా ఫారూక్ మఖాషమ్, హాఫిజ్ మహ్మద్ తకి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి విద్యార్థుల కృషి

**నారాయణపేట, మార్చి 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ చైర్మన్ డా, మెర్సీ వసంత ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ప్రోగ్రామ్ ఆఫీసర్ జి.సంగీత ఆధ్వర్యంలో వేసవి కాల శిబిరం రెండవ రోజు సింగారం గ్రామంలో గ్రామాభివృద్ధి లక్ష్యంగా సర్పంచి నాగిరెడ్డి సమక్షంలో విద్యార్థులు గ్రామ ప్రజలతో కలిసి పలు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు అలాగే చెట్లు నాటడం, భూగర్భ జలాల సంరక్షణ, శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను సూచిస్తూ విద్యార్థులు సమాజ సేవలో ముందంజలో నిలుస్తున్నారు. యువత ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామంలో సానుకూల వాతావరణం నెలకొంది. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమాన్ని అభినందిస్తూ విద్యార్థులకుసహకారంఅందిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిశ్రీనివాస్, అధ్యాపకులు టి.శ్రీనివాస్, సాత్విక, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీచర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్

**నారాయణపేట, మార్చి 26 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండలం మోమినపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఉపాధ్యాయుడు స్వామిపై విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నెల 7వ తేదీన కంప్యూటర్ ల్యాబ్‌కు పిలిపించుకుని అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లుసమాచారం. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినట్లు, విషయం బయటికి రాకుండా ఎంఈవో, ప్రధానోపాధ్యాయుడు, గ్రామ పెద్దలు ప్రయత్నించినట్లు ఆరోపించారు. ఈ ఘటనపై స్పందించిన ఏబీవీపీ నాయకులు, సంబంధిత ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేవలం సస్పెన్షన్ కాకుండా పూర్తిగా ఉద్యోగం నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని వారు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నారాయణపేట నగర కార్యదర్శి సతీష్, జిల్లా కన్వీనర్ నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇంతియాజ్, కార్యకర్త క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బుక్ చేసుకున్న ప్రతి రైతుకు యూరియాను తప్పనిసరిగా అందించాలి : ఏవో హైమావతి



పెస్టిసైడ్ దుకాణాలలో తనిఖీ చేస్తున్న ఏవో హైమావతి

**శ్రీరంగాపూర్, మార్చి 26 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని వెంకటపురం గ్రామంలో గురువారం శ్రీరంగాపూర్ ఏవో హైమావతి ఫర్టిలైజర్ పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో హైమావతి మాట్లాడుతూ అమ్మిన సరుకులను వెంటనే రిజిస్టర్లో పొందపరచుకోవాలని పురుగుల మందులకు సంబంధించిన పి సీలను షాప్ కు సంబంధించిన లైసెన్సులో పొందా పరచాలని పిసీలు లేని పురుగుల మందులను అమ్మినట్లయితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతులకు నాణ్యత కలిగిన పురుగుల మందులను అమ్మాలని షాప్ వారికి తెలియజేశారు. యూరియాను యాప్ ద్వారా బుక్ చేసుకున్న ప్రతి రైతుకు తప్పనిసరిగా యూరియాను అందించాలని సూచించారు. ఏవో హైమావతితో పాటు ఏఈఓ అనూష తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్

**ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం : జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**వనపర్తి, మార్చి 26, ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు స్వయంగా ముందస్తు పెట్టుబడి పెట్టలేని పరిస్థితుల్లో ఉన్నవారికి, బయట అప్పులు చేయకుండా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. గురువారం జిల్లా కలెక్టర్ గోపాల్‌పేట మండల పరిధిలో బుద్ధారం గ్రామాన్ని సందర్శించి, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో గతంలో మంజూరై వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించారు. ఇప్పటికే మంజూరు చేసిన ఈ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారులను త్వరగా గుర్తించాలని తహసిల్దార్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల కమిటీని ఆదేశించారు. లబ్ధిదారులకు త్వరలోనే పట్టాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో గతంలో కొందరు అకతవకలకు పాల్పడ్డారని కొందరు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కూడా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతోమాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణం కోసం ఎవరితోనూ అప్పులు చేయవద్దని సూచించారు. ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక అవసరం ఉంటే స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జిఎస్) ద్వారారుణాలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ పీడీ విఠోబా, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి విజయ్ కుమార్, తహసిల్దార్ తిలక్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మహనీయుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం

◆ అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

**వనపర్తి, మార్చి 26, ప్రభాతవార్త:** ఏప్రిల్ 14న డా.బీ ఆర్ అంబేద్కర్ జయంతి, అలాగే ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ సూచించారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్‌లో డా. బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల నిర్వహణపై దళిత, ప్రజాసంఘాల నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏప్రిల్ 14న జరగనున్న డా.బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి, అలాగే ఏప్రిల్ 5న నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపైవిస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, సంబంధిత శాఖలుసమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఆయా జయంతిల రోజున మహనీయుల జీవిత గాథలను అందరికీ తెలియజేసేలా కళాజాత కార్యక్రమాలు నిర్వహించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమాలు సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ప్రజల భాగస్వామ్యం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రాంజీరావు, బీసీ శాఖ అధికారి ముజాహిద్, ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మతామస్‌దళిత, ప్రజాసంఘాల నాయకులు గంధం గట్టయ్య, గంధం నాగరాజు, మాదారి భోజరాజు, విశ్వం, వీరప్ప, రమేష్ భరత్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ కేసుల పై ఫోకస్ పెంచాలి

- పరిష్కారం పై దృష్టి సారించాలి
- మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి
- గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్, ఎస్సీ, ఎస్టీ కేసుల పై సమీక్ష





సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి , హాజరైన పోలీస్ అధికారులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 26, ప్రభాతవార్త:** పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతంగా చేపట్టాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకిధరావత్ ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, గురువారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని అన్ని పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోఅండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, మిస్సింగ్ కేసులు, ఎన్‌బీడబ్ల్యూ, ఎస్సీ/ఎస్టీ కేసుల పురోగతిని సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసు స్థితిగతులను పరిశీలించి పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో వేగం పెంచడంతో పాటు నాణ్యతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి కేసును పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ చేసి త్వరగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలాచూడాలని పేర్కొన్నారు. ముఖ్యంగా సున్నితమైన ఎస్సీ/ఎస్టీ కేసుల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. నేరాల నివారణలో భాగంగా ప్రతిరోజూ వాహన తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాంగ్ రూట్‌లో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి రోడ్డు భద్రతను కాపాడాలని ఎస్హెచ్‌వోలకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధుల్లో నేరాల నియంత్రణ కోసం రాత్రిపూట క్రమం తప్పకుండా పెట్రోలింగ్ నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. డయల్100 కాల్స్‌కు వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలని, బాధితుల సమస్యలను ఓపికగా విని వారికి అండగా నిలవాలని సూచించారు. ప్రజల విశ్వాసం పెంపొందించే విధంగా పోలీసులు విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వర్టికల్ డీఎస్పీ బాలాజీ, ఇన్స్పెక్టర్లు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలపై వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

**దామరగిద్ద, మార్చి 26 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని క్యాతన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో అరైవ్ అలైవ్" మూడో విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు. రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ వంటి ముఖ్యమైన నియమాలను వివరించారు. చిన్న వయసులోనే ఈ అలవాట్లు అలవరుచుకుంటే భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన పేర్కొన్నారు. వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రత ప్రాముఖ్యతను తమ మాటల్లో వివరించారు. పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, సమాజ భద్రతకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించి, సురక్షిత ప్రయాణాన్ని అలవర్చుకోవాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సామూహిక శ్రీగాయత్రి మహాయజ్ఞం

**బిజినేపల్లి, మార్చి 26 ప్రభాతవార్త:** విశ్వశాంతి లోక కళ్యాణార్థం, ప్రకృతి పర్యావరణ శుద్ధి కోసం నిర్వహించే శ్రీ గాయత్రీ మహాయజ్ఞంలో గురువారం పాలెం గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. శ్రీ సీతారామస్వామి దేవాలయం ఆవరణలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం లో భాగంగా పతంజలి యోగ సమితి తెలంగాణ అధ్యక్షులు వస్పరి శివుడు సామూహిక శ్రీ గాయత్రి మహాయజ్ఞం శాస్త్రోక్తంగా నిర్వహించారు. గాయత్రీ యజ్ఞం ప్రాముఖ్యత వివరిస్తూ జ్ఞానం, ఆరోగ్యము ఆధ్యాత్మిక శ్రేయస్సుతో ముడిపడి ఉందన్నారు. ఈయజ్ఞం మనస్సును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడిని తగ్గించి, ఏకా గ్రత, జ్ఞాపకశక్తిని పెంచుతుందని, ఇది శారీరక, మానసిక సమతుల్యతను సాధించడంలో సహాయపడుతుంది విశ్వానికి ఆత్మగా పరిగణించబడుతుంది అన్నారు. గాయత్రీ మంత్రం ద్వారా ఆధ్యాత్మిక ప్రాముఖ్యత వివరిస్తూ జ్ఞానోదయం లభిస్తుందని, ఇది మేధస్సును సన్మార్గంలో నడిపిస్తుందని చెప్పారు. క్రమం తప్పకుండా గాయత్రీ జపం చేయడం వల్ల పాపాలు తొలగిపోతాయని, దైవిక శక్తులు లభిస్తాయని భావిస్తారని చెప్పారు. జననమరణ చక్రం నుండివిముక్తి పొందడానికి గాయత్రీ మంత్రం సహాయపడుతుందని కొన్నిగ్రంథాలు చెబుతున్నాయి అన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ బోనాసి రామకృష్ణ దంపతులు, కమిటీ అధ్యక్షులు గాడి సురేందర్, ఆలయ ఉత్సవ కమిటీ భక్త బృందం, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్దలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

**రెండోసారి అధ్యక్షులుగా ఎన్నికైన డి.కిరణ్ కుమార్**



ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు

**వనపర్తి, మార్చి 26, ప్రభాతవార్త:** వనపర్తి బార్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జిల్లా కోర్టు ఆవరణలో ప్రశాంతంగా ముగిశాయి. అధ్యక్షులుగా కిరణ్ కుమార్ రెండోసారి విజయం సాధించారు. జనరల్ సెక్రెటరీగా వెంకటరమణ కూడా రెండోసారి విజయం సాధించారు. బార్ అసోసియేషన్ లో మిగిలిన సభ్యులు ఏకగ్రీవం కాగా అధ్యక్ష, కార్యదర్శులకు మాత్రమే పోటీ నిర్వహించారు. మొత్తం వనపర్తి బార్ అసోసియేషన్‌లో 177 ఓట్లకు గాను 159 ఓట్లు పోలయ్యాయి. ఇందులో అధ్యక్షుడు కిరణ్ కుమార్ కు 92 ఓట్లురాగ ఆయనపై పోటీ చేసిన అభ్యర్థికి 63 ఓట్లు లభించాయి. జనరల్ సెక్రెటరీ పోటీ చేసిన వెంకటరమణకు 98 ఓట్లురాగా ఆయనపై పోటీచేసిన అభ్యర్థికి 58 ఓట్లు లభించాయి. ఉదయం 10 గంటల నుంచి నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఫలితాలను వెల్లడించారు. ఎన్నికల అధికారులుగా కృష్ణమోహన్, రాహుల్ వ్యవరించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు ఉపాధ్యక్షులుగా ఉత్తరయ్య , ట్రెజరర్ గా ఎండి అహ్మద్, జాయింట్ సెక్రటరీగా రాంధులి , లైబ్రరీ సెక్రటరీగా ఎండి రియాజ్ , స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వి తిరుపతయ్య, కార్యవర్గ సభ్యులుగా వెంకటేశ్వర్ రెడ్డి, భరణి నాథ్, శ్రీనాథ్, నరేంద్రబాబు, చిరంజీవి లు ఎన్నికయ్యారు. వీరు ఏప్రిల్ ఒకటో తేదీన పదవీ బాధ్యతలు చేపట్టినట్లు ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులను న్యాయవాదులు అభినందించి శాలువా పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ , జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుడు మృతి

**చిన్నచింతకుంట, మార్చి 26 ప్రభాతవార్త:** మండలంలోని పల్లమర్రి గ్రామ పారిశుద్ధ్య కార్మికుడు మీరా ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. గురువారం ఎంపీడీవో లక్ష్మీ నర్సింహులు, గ్రామసర్పంచ్ లక్ష్మీఅంజనేయులు, ఉప సర్పంచ్, విజయ్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డిలు ఆంజనేయులు పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలు గాను గ్రామ సర్పంచ్ పదివేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో గ్రామ కార్యదర్శి అన్వేష ఇందిరమ్మ కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు. టియుసిఐ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుడు మీరా ఆంజనేయులు మృతి చెందడంతో టియుసిఐ జిల్లా అధ్యక్షుడు దేవదానం, పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షులు కురుమన్న లతో వాటర్ కొండన్న, కోళ్ల అంజన్న, రాజులు ఆంజనేయులు పార్థివదేవాన్ని సందర్శించి ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

## చిన్నారికి గీతాంజలి పాఠశాల ఆర్థిక సాయం



చిన్నారికి సహాయం చేస్తున్న పాఠశాల విద్యార్థులు

**మద్దూరు, మార్చి26 ప్రభాతవార్త:** మద్దూరు మండలం చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మద్దూరు గీతాంజలి హైస్కూల్ లో ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి ప్రసన్న తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. చికిత్సకు అవసరమైన ఖర్చులు భరించలేక కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం, రూ.50,000, ఉపాధ్యాయులు, రూ,27,900 విద్యార్థులు రూ,24,782 మొత్తం రూ.1,02,682 విరాళంగా సేకరించి ప్రసన్న తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సహాయం చిన్నారి చికిత్సకు ఉపశమనం కలిగించనుందని, ప్రసన్న తల్లిదండ్రులు పాఠశాల యజమాన్యానికి ఉపాధ్యాయులకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి నష్టపరిహారం అందజేత

**నారాయణపేట, మార్చి 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ షాక్‌తో మరణించిన మహిళ కుటుంబానికి నష్టపరిహారం అందజేశారు. మరికల్ మండలం అప్పంపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ అనంతమ్మ రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాల సమయంలో ఇంట్లో ఇస్త్రీ చేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా షాక్‌కు గురై మరణించారు. ఈ ఘటనపై భారతీయ కిసాన్ సంఘ నాయకులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంఘం పోరాటంతో ప్రభుత్వం స్పందించి విద్యుత్ శాఖద్వారా రూ.5లక్షల నష్టపరిహారం మంజూరు చేసింది. జిల్లా విద్యుత్ అధికారి నవీన్ కుమార్ చేతుల మీదుగా బాధితురాలి భర్త బాల్‌రెడ్డికి చెక్కును అందజేశారు. ఇందులో రూ.4.5 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేసి, రూ.50 వేల చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈ ప్రదీప్ కుమార్, మొగులప్ప, భారతీయకిసాన్ సంఘరాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు వెంకోబా, జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగేఆకుల వెంకటప్ప, శాసముల బాలప్ప, మహిపాల్ రెడ్డి, తంగు విశ్వనాథ్, కురువ భూషణప్ప, జట్రం రాజు, పీకే ఆంజనేయులు, నరసింహారెడ్డి, ఇమామ్‌తదితర రైతునాయకులు కూడా పాల్గొన్నారు. రైతు కుటుంబాలకు జరిగిన అన్యాయాలపై సంఘటితంగా పోరాడితే న్యాయంసాధ్యమవుతుందని ఈ ఘటన ద్వారా స్పష్టమైందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తమకు న్యాయం జరిగేలా కృషి చేసిన అధికారులకు, రైతు సంఘ నాయకులకు బాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, మార్చి 26 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలో చెర్కూర్ గ్రామానికి చెందిన దొడ్ల రమేష్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. మృతుని కుటుంబానికి చెర్కూర్ విజయ డైరీ అధ్యక్షులు గుదే బాలయ్య, ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీలు విజయ డైరీ సభ్యులు రూ.15వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**నర్వ, మార్చి 26 ప్రభాతవార్త:** నర్వ మండలంలోని సీపూర్ గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. గ్రామంలోని పలు కాలనీలలో రూ 50 లక్షల నిధులతో నిర్మించే పనులకు కాంగ్రెస్ పార్టి నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు పాల్గొని గ్రామసర్పంచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రెటరీ నాగన్న గారి శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్లు నెట్టెంపాడు వెంకటయ్య, నరేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగాధర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పి.అశోక్ గౌడ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులు

**అగస్త్య పాఠశాల వార్షికోత్సవంలో సర్పంచ్ రామకృష్ణ**

**రాజాపూర్, మార్చి 26 ప్రభాతవార్త:** నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని.. పిల్లల చదువు, క్రమశిక్షణ, సృజనాత్మకతపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని రాజాపూర్ గ్రామ సర్పంచ్, సర్పంచ్‌ల సంఘం మండలఅధ్యక్షులు కావలి రామకృష్ణ అన్నారు. రాజాపూర్ మండల కేంద్రంలోని అగస్త్య పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో దేశ సంస్కృతిని, సంప్రదాయాలను కాపాడుతూ, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి, నవ భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలన్నారు. అంతకుముందు పలువురు విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ఈ వార్షికోత్సవ వేడుకల్లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మత్తు పై కళా ప్రదర్శన

**మహబూబ్‌నగర్, మార్చి 26, ప్రభాతవార్త :** జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జనరంజని కల్చరల్ అసోసియేషన్ కళాకారులు మహబూబ్‌నగర్ మున్సిపల్‌లోని ఎదిర గ్రామంలోని కళా ప్రదర్శన నిర్వహించారు. ఆంజనేయ స్వామి గుడి దగ్గర మత్తు పానీయాల నియంత్రణపై డ్రగ్స్ పాన్ జర్దా గుట్కా బీడీ చుట్ట కొకైన్ తదితర మాదక ద్రవ్యాల గురించి ప్రజలకు కళా ప్రదర్శనల ద్వారా అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం మాట్లాడుతూయువత రేపటి దేశానికి భావి పౌరులు కావాలని, మత్తు పానీయాలకు లోను కాకుండా ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్పొరేటర్ లలితా భానుచందర్, అంగన్వాడీ టీచర్లు పుష్పలత, సుమతి, కమల, ఉమాదేవి, లావణ్య, భారతమ్మ, కళాకారులు రవిశంకర్, యాదగిరి, నరసింహ, చెన్నయ్య, శ్రీనివాసులు, ఝాన్సీ , వెంకటేష్ పాల్గొన్నారు.

